రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్

- 110 చోట్ల పైలట్ ప్రాజెక్టు

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణకు వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. పైలట్ ప్రాజెక్టుగా 110 రైతు వేదికల్లో ఈ సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. ఇప్పటికే 30 రైతు వేదికల్లో టీవీ ఏర్పాటుతోపాటు ఇంటర్నెట్ కనెక్షన్ కూడా ఇచ్చారు. త్వరలోనే మిగిలిన వేదికల్లోనూ ఏర్పాటు చేయనున్నారు. రైతులను సంఘటితం చేయడంతోపాటు వారికి కొత్త సాగు విధానాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం రైతు వేదికల నిర్మాణాన్ని చేపట్టింది. ఈ రైతు వేదికల ద్వారా గతంలోనే రైతులకు సాగు విధానాలపై పలుమార్లు అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించింది. ప్రతి రైతు వేదికలోనూ ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేయించి శాస్త్రవేత్తలతో మాట్లాడే సదుపాయాన్ని కల్పించాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదన ఇప్పుడు పట్టాలెక్కింది.

దళితబంధుకు దారేది?

- నిధుల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- బ్యాంకుల్లో మూలుగుతున్న నిధులు
- ఆందోళనలో లబ్ధిదారులు

హైదరాబాద్, జనవరి18 (నమస్తే తెలంగాణ): దళితబంధు లబ్ధిదారులు డోలాయమానంలో పడ్డారు. పథకం కింద ఇప్పటికే యూనిట్లు ఎంపిక చేసుకున్న వారు మిగిలిన నిధులు వస్తాయో? రావో? తెలియక మథనపడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు కింద ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించడమే కాకుండా జీవనోపాధిని ఎంచుకునే స్వేచ్ఛ కల్పించింది. రూ. 10 లక్షలతో ఒకేసారి భారీ యూనిట్‌ను ఎంచుకోవడం కాకుండా లాభదాయకంగా ఉండే బహుళ యూనిట్లను ఎంచుకునేలా ప్రోత్సహించింది. ఇందులో భాగంగా 200కుపైగా యూనిట్లను గుర్తించింది. వీటిలో డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఇటుకల తయారీ, పేపర్ ప్లేట్ల తయారీ, క్యాటరింగ్, ఇంజినీరింగ్ వర్క్స్, ఫర్నిచర్ తయారీ వంటివి ఉన్నాయి. తొలి విడతలో దళితబంధు పథకం కింద మొత్తం 38,323 దళిత కుటుంబాలను ఎంపికచేసిన ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 10 లక్షల చొప్పున జమచేసింది. లబ్ధిదారుల్లో కొందరు ఐదేసి లక్షలతో రెండేసి యూనిట్లు ఏర్పాటుచేసుకోగా, దాదాపు 2 వేలమంది రెండో యూనిట్ ఏర్పాటు చేసుకునే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో నిధుల విడుదల ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికలు ముగిసి, కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా రెండో యూనిట్‌కు సంబంధించి నిధులు విడుదల కాకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. నిధులు విడుదల చేస్తారా? చేయరా? అన్న సందేహం వారిని వేధిస్తున్నది.

బ్యాంకుల్లోనే నిధులు

దళితబంధు లబ్ధిదారులు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉంటుంది. ప్రభుత్వం అందులోనే డబ్బులు జమచేస్తుంది. డబ్బును విత్ డ్రా చేసుకునేందుకు ప్రభుత్వం కొన్ని షరతులు విధించింది. నిధులు దుర్వినియోగం కాకుండా డెబిట్‌కార్డులు, చెక్‌బుక్‌లు, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లకు అవకాశం లేకుండా చేసింది. లబ్ధిదారుడు యూనిట్‌ను ఎంపికచేసుకుని అందుకు సంబంధించిన కంపెనీల నుంచి కొటేషన్ తీసుకుని దానిని కలెక్టర్‌కు అందించాల్సి ఉంటుంది. ఆయన దానిని పరిశీలించి సదరు కంపెనీ పేరుపై డీడీ చెల్లించాలని బ్యాంకుకు ఆదేశాలు జారీచేస్తారు. ప్రస్తుతం బ్యాంకుల్లో నిధులున్నా వాటి విడుదలకు ఆదేశాలు జారీచేయకపోవడంతో యూనిట్లు నెలకొల్పలేకపోతున్నారు.

స్పష్టతనివ్వండి

రెండో యూనిట్ కోసం అన్నీ సిద్ధం చేసుకుని అధికారులకు కొటేషన్లు ఇచ్చినా నిధులు ఇంకా విడుదల కాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. నిధుల విడుదల విషయంలో స్పష్టత ఇవ్వాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతున్నారు. రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారుల పరిస్థితి కూడా ఇలానే ఉంది. సాంఘిక సంక్షేమ శాఖకు ప్రస్తుతం మంత్రి లేకపోవడం, ఆ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను సాగునీటిపారుదలశాఖకు బదిలీ చేయడంతో శాఖాపరమైన కార్యక్రమాలన్నీ స్తంభించిపోయాయి. మంత్రితోపాటు పూర్తిస్థాయి కార్యదర్శి వచ్చి సమీక్ష నిర్వహించిన తర్వాత మాత్రమే దళితబంధు విషయంలో స్పష్టత వచ్చే అవకాశముందని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు చెప్తున్నారు.

వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

దళితబంధు కోసం ఆత్మహత్యాయత్నం

- ములుగు కలెక్టరేట్ ఎదుట వాటర్ ట్యాంక్ ఎక్కి పెట్రోల్ పోసుకొని లబ్ధిదారుల నిరసన

ములుగు రూరల్, జనవరి 18: దళితబంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. గురువారం ములుగు కలెక్టరేట్ వద్ద ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. సుమారు 6 గంటలపాటు ఆందోళన చేపట్టారు. మంత్రి సీతక్క, కలెక్టర్ వచ్చి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కవ్వంపల్లి బాబు, మీదిగొండ రాజేంద్రప్రసాద్, ఊట్ల మోహన్ వాటర్ ట్యాంకు ఎక్కారు. రాజేంద్ర ప్రసాద్ పెట్రోల్ మీద పోసుకొని తన ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఎస్సై వెంకటేశ్వర్, సిబ్బంది నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ములుగు పర్యటనలో ఉన్న సీతక్కతోపాటు కలెక్టర్ రాకపోవడంతో ట్యాంకు వద్ద ఉన్న మరికొందరు లబ్ధిదారులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు దళితబంధు సాధన కమిటీ జిల్లా అధ్యక్షుడు కోగిల మహేశ్‌ను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కొంత సేపటికి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. నిరసన ఉధృతంగా మారుతుండటంతో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి వాటర్ ట్యాంకుపై ఉన్న లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, విషయాన్ని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇవ్వడంతో లబ్ధిదారులు కిందకు దిగారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ జిల్లాలోని 1,100 మంది రెండో విడత దళితబంధు పథకానికి ఎంపికయ్యారని, లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం వెంటనే డబ్బులను జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

తెలంగాణకు మరిన్ని కంపెనీల రాక

- ఐటీఐల్లో స్కిల్లింగ్ సెంటర్లు పెట్టనున్న టాటా గ్రూప్
- సేవలను మరింత విస్తరించనున్న ఉబర్ సంస్థ
- దావోస్‌లో ముగిసిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో పలు దేశ, విదేశీ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఈ మేరకు పలు కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ ఎంవోయూలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, పరిశ్రమలశాఖ మంత్రి డీ శ్రీధర్‌బాబు, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ ఇతర అధికారులు సంతకాలు చేశారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన కంపెనీలలో బ్రిటన్‌కు చెందిన సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ గ్రూప్ హోల్డింగ్స్ (ఎస్ఐజీహెచ్), టాటా గ్రూప్, బీఎల్ ఆగ్రో, క్యూ సెంట్రియో, ఉబర్, సిస్ట్రా, ఓ9 తదితర కంపెనీలు ఉన్నాయి. బీఎల్ గ్రూప్ రూ.500 కోట్లు, ఎస్ఐజీహెచ్ రూ.235.1 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రకటించాయి. అత్యధికంగా టాటా గ్రూప్ సంస్థ రూ.1500 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆయా సంస్థల అధిపతులు, ప్రతినిధులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

టాటా గ్రూపు స్కిల్లింగ్ సెంటర్లు

రాష్ట్రంలోని 50 ఐటీఐలలో అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రాల (స్కిల్లింగ్ సెంటర్లు) ఏర్పాటుకు టాటా గ్రూపు ముందుకొచ్చింది. వీటిలో కొత్త కోర్సులు, మాస్టర్ ట్రైనర్ల నియామకానికి రూ.1500 కోట్లు పెట్టుబడి పెట్టనున్నది. ఈ 50 ఐటీఐల్లో అడ్వాన్స్‌డ్ స్కిల్లింగ్ సెంటర్ల ఏర్పాటునకు, వాటిల్లో కొత్త కోర్సులపై శిక్షణనిచ్చేందుకు మాస్టర్ ట్రైనర్లను నియమించనున్నది.

ఆహార ఉత్పత్తుల బీఎల్ ఆగ్రో

వివిధ ఆహార ఉత్పత్తులను తయారుచేసే ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీఎల్ ఆగ్రో సంస్థ తెలంగాణలో ప్రాథమికంగా రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. తమ సంస్థలో 5000 మంది ఉపాధి లభిస్తుందని ఒక ప్రకటనలో తెలిపింది. యూకేకు చెందిన ప్రముఖ వైద్య పరికరాల తయారీ సంస్థ సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ గ్రూప్ హోల్డింగ్స్ రాష్ట్రంలో రూ. 231.5 కోట్లమేర పెట్టుబడితో తయారీ కేంద్రాన్ని నెలకొల్పనుంది. ఐటీ అభివృద్ధి సేవలు అందించే క్యూ సెంట్రియో కంపెనీ తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్ పరిధిలో దాదాపు 1000 ఉద్యోగాల కల్పనను లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఉబర్ కంపెనీ హైదరాబాద్‌లో తమ సేవలను విస్తరించనున్నట్టు ప్రకటించింది. ఈ ప్రాజెక్టుతో సుమారు 1000 మంది ఇంజనీర్లకు ఉపాధి లభిస్తుందని కంపెనీ తెలిపింది. రాష్ట్రంలో డిజిటల్ సెంటర్ ఏర్పాటునకు సిస్ట్రా కంపెనీ ముందుకొచ్చింది.

అకాడమీని ప్రకటించిన ఓ9 సొల్యూషన్స్

ఓ9 సొల్యూషన్స్ సంస్థ తెలంగాణలో ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రత్యేక సప్లై చైన్ నైపుణ్యాల అకాడమీని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. సప్లై చైన్ నైపుణ్యాలను అందించేందుకు ఈ అకాడమీ తోడ్పడనున్నది. డబ్ల్యూఈఎఫ్ సదస్సు గురువారం ముగియడంతో సీఎం రేవంత్‌రెడ్డి అక్కడి నుంచి నేరుగా లండన్ చేరుకున్నారు. అక్కడి విమానాశ్రయంలో తెలంగాణ ప్రవాసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

టాటాసన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్‌కు జ్ఞాపిక అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

దావోస్‌లో రేవంత్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): రైతులకు పెట్టుబడి సాయం విషయంలో దావోస్‌లో సీఎం రేవంత్‌చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. రైతు భరోసా పేరుతో రైతులకు కాంగ్రెస్ పార్టీ పెట్టుబడి సాయం అందిస్తున్నదని ముఖ్యమంత్రి చెప్పుకున్నారని, కేసీఆర్ ప్రారంభించిన రైతుబంధు పథకాన్ని తమ పథకంగా చెప్పుకోవడం సీఎం రేవంత్‌రెడ్డి దిగజారుడుతనానికి పరాకాష్ట అని సతీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

బస్సు సీటు కోసం చెప్పు దెబ్బలు

నాలుగు రోజుల క్రితం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో సీట్ల విషయంలో మహిళల మధ్య గొడవ జరిగింది. చిన్న గొడవ తలెత్తి చెప్పులతో కొట్టుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకొని సముదాయించారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం వెంకట్‌రావుపేటలో చోటుచేసుకున్న ఈ ఘటన.. గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రభుత్వం ప్రయాణికులకు సరిపడా బస్సులు నడపకపోవడం వల్లే గొడవలు జరుగుతున్నాయని మహిళలు వాపోతున్నారు. -తొగుట

- తమ్మినేనికి మంత్రుల పరామర్శ

గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర ప్రముఖులు కూడా తమ్మినేనిని గురువారం పరామర్శించారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

బడ్జెట్‌లో 'గ్యారెంటీ'లకే ప్రాధాన్యం

- ప్రజలపై భారం లేకుండా నిధుల సేకరణ
- 2014 తర్వాత 'అసైన్డ్ భూముల' వివరాలివ్వండి : భట్టి

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీల అమలుకు ప్రాధాన్యం ఇవ్వాలని డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖమంత్రి మల్లు భట్టివిక్రమార్క సూచించారు. ప్రజలపై భారం మోపకుండా ప్రత్యామ్నాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని కోరారు. 2024-25 బడ్జెట్ ప్రతిపాదనల తయారీకి సంబంధించి గురువారం సచివాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి రెవెన్యూ, హౌసింగ్, ఐఅండ్‌పీఆర్, వ్యవసాయం, మార్కెటింగ్, చేనేత, జౌళి, ఉద్యానవనశాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తులు సృష్టించి వచ్చిన ఆదాయాన్ని ప్రజలకు పంచేందుకు అధికారులు, ప్రభుత్వం కలిసి పనిచేయాలని పేర్కొన్నారు. 2014 వరకు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేసిన భూముల వివరాలు, గత పదేండ్లలో ప్రభుత్వం వెనక్కి తీసుకున్న భూముల వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూశాఖను ఆదేశించారు. గత పదేండ్లలో కేంద్రం తెలంగాణకు 1.5 లక్షల ఇండ్ల నిర్మాణానికి మాత్రమే నిధులు ఇచ్చిందని అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం తయారు చేసిన ప్రతిపాదనలను డిప్యూటీ సీఎం భట్టికి వివరించారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా పూర్తిగా అరికట్టాలని, విత్తన తయారీలో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించని కంపెనీలపై ఉక్కుపాదం మోపాలని అధికారులను డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశించారు. చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో అమలుచేస్తున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ చీరలు, విద్యార్థులకు అందించే యూనిఫాం వస్త్ర తయారీ గురించి ఆరా తీశారు. సమావేశంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రటరీలు నవీన్ మిట్టల్, శ్రీనివాసరాజు, ఐఅండ్‌పీఆర్ స్పెషల్ కమిషనర్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో పోటీ చేసే హక్కు నాదే

- సోనియా వస్తే త్యాగం చేస్తా
- అవసరమతే టీడీపీతో కలుస్తాం
- కాంగ్రెస్ నేత రేణుకాచౌదరి

ఖమ్మం, జనవరి 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసే హక్కు తనకు మాత్రమే ఉన్నదని కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి పేర్కొన్నారు. సోనియాగాంధీ ఖమ్మం నుంచి పోటీ చేయాలని తామంతా కోరామని, దీనిపై స్పష్టత వచ్చేంత వరకు ఇక్కడ ఎవరి అభ్యర్థిత్వాలపై చర్చలు జరగబోవని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సోనియా గాంధీ పోటీ చేయకపోతే ఖమ్మం ఎంపీ స్థానం నుంచి తానే బరిలోకి దిగుతానని చెప్పారు. తనను కాదనే శక్తి ఎవరికీ లేదని అన్నారు. ఎవరికి ఏ పదవి ఇవ్వాలో అధిష్ఠానం నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. అవసరమైతే భవిష్యత్‌లో టీడీపీతో కలిసి పనిచేస్తామని చెప్పారు. హిందూత్వ పునాదులపై రాజకీయాలు నడపాలనుకుంటున్న వారి ఆటలు భవిష్యత్‌లో సాగబోవని బీజేపీని రేణుకాచౌదరి హెచ్చరించారు.

ఎరువుల పంపిణీలో జాప్యం చేయొద్దు

- కొరత లేదు.. రైతులు ఆందోళన చెందొద్దు
- వారంలోగా పాత బకాయిలు వసూలు చేయండి
- లేదంటే అధికారులపై కఠిన చర్యలు
- సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశం

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): ప్రతి గ్రామంలో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని, పంపిణీలో జాప్యం చేయొద్దని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఎరువుల పంపిణీలో వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గురువారం సచివాలయంలో ఎరువుల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత యాసంగితో పోల్చితే ఈ యాసంగిలో ఎరువులు అధిక మొత్తంలో నిల్వ ఉన్నాయని చెప్పారు. అన్ని ఎరువులు కలిపి నిరుడు 7.02 లక్షల టన్నులు నిల్వ ఉండగా ప్రస్తుతం 8.59 లక్షల టన్నులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అయినా పంపిణీ ఎందుకు ఆలస్యమవుతున్నదని అధికారులను ప్రశ్నించారు. లారీల సమ్మె కారణంగా నిర్మల్ జిల్లాలో జరిగిన ఘటనపై స్పందిస్తూ.. ఇలాంటి పరిస్థితుల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. డీసీసీబీలు, ప్రాథమిక సహకార సంఘాల్లో పేరుకుపోయిన వ్యవసాయేతర రుణాలను వారంలోగా వసూలు చేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా రుణాలు తీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టెస్కాబ్ ఎండీ మురళీధర్‌కు సూచించారు.

అందరికీ 12,000 కుదరదు!

మొదటిపేజీ తరువాయి...

పరిష్కారం దొరుకుతుందన్న ఆశతో వెళ్తే ఆటో డ్రైవర్ అంటే ఎవరు? అన్న ప్రశ్న మంత్రి నోటి నుంచి రావడంతో ఆశ్చర్యపోయారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం చర్చలు జరిపారు. సమావేశం మధ్యలో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయామని ప్రస్తావిస్తే 'ఏం చేస్తే బాగుంటుందో మీరే చెప్పాలి' అంటూ మంత్రి ఎదురు ప్రశ్నలు వేయడంతో ఆటో సంఘాల నాయకులు విస్తుపోయారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రకారం ఏడాదికి రూ.12 వేలు చెల్లించడంపై చర్చ రావడంతో 'ఆటో డ్రైవర్ అంటే ఎవరు? అందరూ ఆటో డ్రైవర్లమనే చెప్తారు? అందరికీ ఇవ్వడం ఎలా కుదురుతుంది?' అని మంత్రి అనడంతో ఆటో యూనియన్ నాయకులు నీరుగారిపోయారు. 'మరోసారి సమావేశం ఏర్పాటు చేసుకుందాం. అప్పుడు మళ్లీ అభిప్రాయాలు చెప్పండి. వాటిని నోట్ చేసుకొని చర్చిస్తాం' అని మంత్రి అనడంతో రెండు గంటలకుపైగా జరిగిన సమావేశంలో ఏ సమస్యలతో వెళ్లారో, వాటికి జవాబులేకుండానే తిరిగొచ్చారు. చర్చల్లో ఎక్కడా కూడా ఆటో డ్రైవర్ల ఉపాధిపై పడిన దెబ్బపై మాట్లాడకుండా, కేవలం కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన అంశాలు, హైదరాబాద్‌లో ఆటో పర్మిట్లు వంటి విషయాలపైనే చర్చించారని ఆటో సంఘాల నేతలు వాపోయారు. ఆటోడ్రైవర్ అంటే ఎవరో తెలియనిదే, ఎన్నికల్లో హామీ ఎలా ఇచ్చారని మండిపడుతున్నారు. ఎలాంటి హామీ లేకుండానే చర్చలు ముగియడంతో పైకి ఏమీ అనలేక, లోలోపల బాధతోనే బయటకు వచ్చేశారు.

ఆటో డ్రైవర్లతో రాజకీయమా?

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటో సంఘాలను ఆహ్వానించకుండా కాంగ్రెస్ అనుబంధ సంఘాలనే చర్చలకు పిలవడమేమిటని టీఏటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేలు, ఆటోలో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశపెట్టి ఆదుకోవాలనే ప్రధాన డిమాండ్లపై చర్చల్లో మంత్రి ఎలాంటి హామీ ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. చర్చలకు వెళ్లిన కాంగ్రెస్ అనుబంధ ఆటో యూనియన్ నాయకులు నిరాశగానే వెనుదిరిగారని చెప్పారు. ఆటో డ్రైవర్లందరి గురించి కాకుండా, కేవలం హైదరాబాద్‌లోని ఆటో డ్రైవర్లను పరిగణనలోకి తీసుకొని పర్మిట్లకు అనుమతిస్తామని మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉన్నదని మారయ్య మండిపడ్డారు. నగరంలో మరోసారి ఆటో పర్మిట్లకు అనుమతులిచ్చి కమీషన్ దందాకు తెరలేపబోతున్నారని ఆరోపించారు.

ఆటో చార్జీల పెంపును ఒప్పకోం

- ఆటో యూనియన్లతో భేటీలో మంత్రి పొన్నం

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): ఆటో చార్జీలు పెంచుకోవడానికి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించదని మంత్రి పొన్నం ప్రభాకర్ తేల్చిచెప్పారు. గురువారం సచివాలయంలో మంత్రి పొన్నం అధ్యక్షతన ఆటో యూనియన్ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్లు కొంత ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించిందని, ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్, అసంఘటిత రంగ కార్మికులు, ఉద్యోగుల అధ్యక్షులు కౌషల్ సమీర్, కేకేసీ ఆటో విభాగం అధ్యక్షుడు మల్లేశ్, ఐఎన్‌టీయూసీ ప్రతినిధి మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు ఇవీ..

- ఈఎస్ఐతో కూడిన ఆటో మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.
- ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలలి.
- గ్రేటర్ హైదరాబాద్‌లో కొత్తగా ఆటోలకు పర్మిట్లు ఇవ్వాలి.
- ఆటో మీటర్ చార్జీలను పెంచాలి.
- ఆటోలకు ఇన్సూరెన్ చెల్లించాలి.
- గీత, నేత కార్మికుల్లా 50 ఏండ్లు నిండిన డ్రైవర్లకు పెన్షన్ ఇవ్వాలి.
- అక్రమంగా నడుస్తున్న ఓలా, ఉబర్ వంటి బైక్ రైడ్‌లను నిషేధించాలి.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా మహేశ్, వెంకట్

- ఇద్దరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవం.. పరిశీలన తర్వాత అధికారిక ప్రకటన

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవులకు నామినేషన్ల గడవు గురువారం ముగియగా, కాంగ్రెస్ పార్టీ నుంచి నిజామాబాద్‌కు చెందిన మహేశ్‌కుమార్‌గౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బల్మూరి వెంకట్ ఇద్దరే నామినేషన్లు దాఖలుచేశారు. ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి రెండు నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో మహేశ్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్ ఏకగ్రీవం కానున్నారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన అనంతరం వీరిద్దరి ఎన్నికను ఎన్నికల రిటర్నింగ్ అధికారి అధికారికంగా ప్రకటించనున్నారు. వీరిద్దరి పదవీ కాలం 2027న ముగియనున్నది. ఎమ్మెల్యే కోటాలో బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్సీలుగా ఎన్నికైన కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందడంతో వారు తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఖాళీ అయిన ఈ రెండు స్థానాల భర్తీకి ఎన్నికల సంఘం వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీచేసింది. ఈ మేరకు నామినేషన్ల దాఖలుకు గురువారం గడువు ముగిసింది. అసెంబ్లీలో అధికార కాంగ్రెస్ మెజార్టీ కలిగి ఉండటంతో ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఆ పార్టీకే దక్కనుండటంతో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తన అభ్యర్థులను బరిలోకి దించలేదు.